సాక్షి
అన్నమయ్య జిల్లా
శుక్రవారం । 6 । అక్టోబర్ । 2023



రైల్వేలో ఎన్నికల వేడి!
సౌత్ సెంట్రల్ రైల్వే కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ డెలిగేట్ స్థానాలకు నోటిఫికేషన్ విడుదల కావడంతో రైల్వే కార్మిక వర్గాల్లో ఎన్నికల సందడి మొదలైంది. -8లో



నెల్లూరు, అనంత జట్ల విజయం
కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్–23 అంతర్ జిల్లాల మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్‌లో నెల్లూరు, అనంతపురం జట్లు విజయం సాధించాయి. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.86	రూ.110
రెండోరకం	రూ.50	రూ.82



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 366 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	421	445
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 120.140 కిలోలు

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటిటౌన్: అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంగ్లీషు గెస్ట్ అధ్యాపకుడిగా పని చేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ హర్షలతా పంకజ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు పీజీలో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు. ఎస్‌ఈటీ, ఎన్‌ఈటీ, పీహెచ్‌డీ చేసిన వారు అర్హులన్నారు. అన్ని సర్టిఫికెట్లతో ఈనెల 7వ తేదీ ఉదయం కళాశాలలో జరిగే ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు.

బీసీ శాసనసభ కమిటీ సభ్యుల పర్యటన వాయిదా

కడప రూరల్ : బీసీ శాసనసభ కమిటీ సభ్యుల అధికారిక పర్యటన వాయిదా పడినట్లు జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి బ్రహ్మయ్య తెలిపారు. కమిటీ సభ్యులు శుక్రవారం జిల్లాలో పర్యటించాల్సి ఉందన్నారు. అయితే కొన్ని కారణాలతో పర్యటన వాయిదా పడిందని ఆయన తెలిపారు.

8న విలువిద్య జట్టు ఎంపిక



కడప స్పోర్ట్స్: కడపలోని డాక్టర్ వైఎస్సార్ క్రీడా పాఠశాలలో ఈ నెల 8న ఉమ్మడి వైఎస్సార్ జిల్లా స్థాయి విలువిద్య జట్టు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా విలువిద్య సంఘం అడ్‌హక్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు జనార్దన్‌రెడ్డి, రాచవీటి తేజేంద్ర ఓ ప్రకటనలో తెలిపారు. జూనియర్, సీనియర్ విభాగాల్లో ఉదయం పది గంటలకు జరిగే ఈ ఎంపికల్లో ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టుకు ఎంపిక చేస్తారన్నారు. ఈ నెల 21వ తేదీ నుంచి 24వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీలు వేంపల్లి పట్టణంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. 2003 జనవరి తర్వాత పుట్టిన క్రీడాకారులను జూనియర్ విభాగానికి ఎంపిక చేస్తామన్నారు.

7, 8 తేదీల్లో క్విజ్ పోటీ

కడప కల్చరల్: కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శని, ఆదివారాల్లో సీరతున్నబీ క్విజ్ పోటీలను నిర్వహించనున్నట్లు సొసైటీ అధ్యక్షులు డాక్టర్ ముక్తార్ అమ్మద్ తెలిపారు. వైఎస్సార్ జిల్లాతోపాటు అన్నమయ్య జిల్లాలోని మదరసాల విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మదరసా విద్యార్థులకు శనివారం ఉదయం, పాఠశాల, కలశాల విద్యార్థులకు ఆదివారం పోటీలను నిర్వహిస్తామన్నారు. ఇంటర్, డిగ్రీ విద్యార్థులను సీనియర్లుగా పరిగణించి విజేతలైన వారికి మొదటి బహుమతి రూ.10 వేలు, రెండవ బహుమతి రూ. 5 వేలు, మూడో బహుమతి రూ. 3 వేలు నగదు ఇవ్వనున్నట్లు తెలిపారు. 6 నుంచి 10వ తరగతి వరకు జూనియర్ గ్రూప్స్‌గా పరిగణించి విజేతలైన వారికి మొదటి బహుమతిగా రూ. 5 వేలు, రెండవ బహుమతిగా రూ. 3 వేలు, మూడవ బహుమతిగా రూ. 2 వేలు అందజేస్తామని తెలిపారు. ప్రతి తరగతిలో ఉర్దూ, తెలుగు, ఇంగ్లీషు విభాగాలలో జూనియర్లు, సీనియర్లకు అందజేస్తామన్నారు. కడప నగరంలోని అల్మాస్‌పేటలోగల జామియా తుస్సాలిహాత్ మదరసాలో ఈ పోటీ నిర్వహిస్తామన్నారు. ఆసక్తిగల వారు 99857 73395 నెంబరులో సంప్రదించాలన్నారు.

అన్నం..ఆరోగ్య స్వరూపం

- సంతులిత పోషకాల సమాహారంగా ఫోర్టిఫైడ్ రైస్
- గర్భిణులు, బాలింతలకు ప్రయోజనం
- పోషకాహార లోపాల నివారణకు ప్రభుత్వం చర్యలు
- ప్లాస్టిక్ రైస్ అంటూ అపోహలు
- అంగన్‌వాడీల అవగాహన కార్యక్రమాలు



పెద్దమండ్యం మండల కేంద్రంలో గర్భవతులకు అందిస్తున్న వైఎస్సార్ సంపూర్ణ కిట్లతోపాటు ఫోర్టిఫైడ్ బియ్యం

సాక్షి, రాయచోటి: ప్రభుత్వం చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పోషకాహారం అందించడమే ధ్యేయంగా అడుగులు వేస్తోంది. ఏ ఒక్కరూ అనారోగ్యం బారిన పడకుండా ఆరోగ్యకరమైన జీవితం గడపాలన్న లక్ష్యంతో నాణ్యమైన ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టింది.నాణ్యతలో తేడా లేకుండా చర్యలు చేపట్టింది. పోషకాహార లోపాన్ని నివారించేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. మాతాశిశు మరణాల నియంత్రణ, పిల్లల ఎదుగుదలపై దృష్టి సారించింది. ఫోర్టిఫైడ్ రైస్‌తో సమస్యకు చెక్ పెడుతోంది.ఈ బియ్యం అందుబాటులోకి వచ్చి నెలలు గడిచినా ఇప్పటికీ వినియోగంపై అపోహలు ఉన్నాయి. వాటిని తొలగించేందుకు అంగన్వాడీ సిబ్బంది కృషి చేస్తున్నారు.

ఫోర్టిఫైడ్ రైస్ అంటే..
ఫోర్టిఫైడ్ రైస్‌ను వాడుక భాషలో బలవర్ధక బియ్యంగా పిలుస్తారు. సాధారణ బియ్యానికి దీనికి అనేక అంశాల్లో సారూపత్య ఉంది. బలవర్ధక బియ్యంలో పోషకాలు మెండు. పోషకాలను ప్రత్యేక గింజలు తయారు చేసి సాధారణ బియ్యంలో కలుపుతారు. వీటిని జతచేసి పంపిణీ చేస్తారు. ఈ కృత్రిమ బియ్యాన్ని కెర్నల్స్ అంటారు. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎఫ్ఎస్ఎస్ఏఐ) మార్గదర్శకాల ప్రకారం ప్రతి వంద కిలోల బియ్యానికి వ్యక్తి ఆరోగ్యస్థితి అవసరాన్ని బట్టి (సరఫరా అయ్యేది బాలింతలకా, గర్భిణులకా లేదా సాధారణ వ్యక్తులకా అనే అంశం పరిగణనలోకి తీసుకుంటారు) ఒక కిలో లేదా రెండు కిలోల కెర్నల్స్‌ని కలుపుతారు.

వంట విధానంలోనూ మార్పు అవసరం
బలవర్ధక బియ్యంలో జతచేర్చిన పోషకాలను కోల్పోకుండా ఉండాలంటే ప్రత్యేక వంట విధానాన్ని అవలంభించాలని కాకినాడ సీడీపీఓ దయామణి వెల్లడించారు.

- ఫోర్టిఫైడ్ రైస్ కడిగేటప్పుడు అతిగా రుద్దకూడదు. వండే ముందు కొంతసేపు నీటిలో ఉంచి ఆ నీటిని ఒంచేయాలి. మరో మారు నీరు వేసి కడగాలి. తద్వారా పోషకాలు కోల్పోవు
- అన్నం వండేటప్పుడు నెయ్యి, దాల్చిన చెక్క జీలకర్ర, యాలికలు, లవంగాలు వంటి దినుసులు జోడిస్తే మంచి ఫలితాలు ఉంటాయి.
- ఫోర్టిఫైడ్ రైస్‌లో పోషకాలు మరింత ద్విగుణీకృతం చేసేందుకు సగం నీరు, సగం పాలు కలిపిన ద్రవంలో ఉడికిస్తే మేలు.
- ఫోర్టిఫైడ్ బియ్యాన్ని ఎప్పుడూ మూత పెట్టి ఉడికించాలి. తెరిచిన పాత్రలో వండితే పోషకాలు ఆవిరి రూపంలో కోల్పోవాల్సి ఉంటుంది.
- అల్యూమినియం కుక్కర్లకు బదులుగా స్టీలు, గాజు, మట్టి పాత్రల్లో వండటం పోషకాల నిలుపుదలకు దోహదపడతాయి.



కిలో ఫోర్టిఫైడ్ రైస్‌లో ఉండే మూలకాలు

ఐరన్	:	42.5 మిల్లీ గ్రాములు
ఫోలిక్ యాసిడ్	:	125 మైక్రోగ్రాములు
విటమిన్ బి12	:	1.25 మైక్రోగ్రాములు
జింక్	:	15 మిల్లీ గ్రాములు
విటమిన్ ఏ	:	700 మైక్రోగ్రాములు
విటమిన్ బి1	:	1.5 మిల్లీ గ్రాములు
విటమిన్ బి2	:	1.75 మిల్లీ గ్రాములు
విటమిన్ బి3	:	20 మిల్లీ గ్రాములు
విటమిన్ బి6	:	2.5 మిల్లీ గ్రాములు

ప్లాస్టిక్ బియ్యం కాదు
ఫోర్టిఫైడ్ రైస్ ప్రాధాన్యతను గుర్తించక పలువురు గర్భిణులు, బాలింతలు ప్లాస్టిక్ రైస్ అంటూ తప్పుడు ప్రచారాలను నమ్ముతున్నారు. సాధారణంగా సంతులిత పోషకాలతో నిండిన కృత్రిమ బియ్యానికి ప్రత్యేక గుణముంది. తయారీ ప్రక్రియలో పోషకాల చేరికలోని హెచ్చుతగ్గుల కారణంగా వాటిలో కొన్ని నీటిలో తేలే గుణాన్ని కలిగి ఉంటాయి. అలా తేలిన బియ్యాన్ని ప్లాస్టిక్ బియ్యంగా భ్రమపడుతున్నారు. ఇవి ప్లాస్టిక్ బియ్యం కాదంటూ భద్రంగా వినియోగించుకోవచ్చంటూ నిపుణులు చెబుతున్నారు.

ఐసీడీఎస్ ప్రాజెక్టుల సంఖ్య	11
అంగన్వాడీ కేంద్రాలు	1858
మినీ అంగన్వాడీ కేంద్రాలు	417
గర్భిణులు	11,738
బాలింతలు	11,212
6 నెలల నుంచి ఆరేళ్లలోపు చిన్నారులు	1,09,171
రక్తహీనత ఉన్న బాలింతలు, గర్భిణులు	1915
వయస్సుకు తగ్గట్టు బరువు పెరగని చిన్నారులు	1614
పోషకాహార లోపంతో ఎత్తు పెరగని చిన్నారులు	3194

ఫోర్టిఫైడ్ బియ్యం శక్తివంతం



బాలింతలు, గర్భిణులకు అందించే ఫోర్టిఫైడ్ బియ్యం చాలా శక్తివంతమైంది. అంగన్వాడీలతోపాటు బాలింతలు, గర్భిణులకు కూడా అందిస్తున్నాం. మంచి ఫలితాలు వస్తున్నాయి.
– ఖిద్దింటి దనలక్ష్మీ, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ సాధికారత అధికారిణి, అన్నమయ్య జిల్లా

రుచికరమైన ఆహారం



ప్రభుత్వం అందిస్తున్న ఫోర్టి ఫైడ్ బియ్యంతో ఆహారం చాలా రుచికరంగా ఉంటోంది. మహిళల ఆరోగ్య విషయంలో ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ చిక్కీలు మొదలుకొని నూనె, రాగి జావ, కోడిగుడ్లు, బియ్యం అందిస్తున్నారు.
– పి.సులోచన, కేసీ పల్లి, రామసముద్రం మండలం, అన్నమయ్య జిల్లా

రాజ్యాంగాన్ని అపహాస్యం చేసిన బీజేపీ

పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు



మాట్లాడుతున్న గిడుగు రుద్రరాజు

మదనపల్లె: ఆంధ్రప్రదేశ్ విభజన సమయంలో ప్రధాని మన్మోహన్‌సింగ్, యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ రాష్ట్రానికి విభజన హామీల రూపంలో రూ.5లక్షల కోట్లు మేలును చట్టరూపంలో చేస్తే వాటిని అమలుచేయకుండా తుంగలో తొక్కి బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని అపహాస్యం చేసిందని పీసీసీ అధ్యక్షుడు గిడుగురుద్రరాజు అన్నారు. గురువారం జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో మదనపల్లెలో సేవ్ కానిస్టిట్యూషన్, డెమోక్రసీ, నేషన్ నినాదంతో ర్యాలీ, బహిరంగసభ నిర్వహించారు. కార్యక్రమానికి కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మయప్పన్, వర్కింగ్ ప్రెసిడెంట్ జంగాగౌతమ్, ఎస్సీసెల్ అధ్యక్షుడు సాకేశంకర్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. సమావేశం ప్రారంభానికి ముందు స్థానిక బెంగళూరు బస్టాండ్‌లో ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కార్యకర్తలు, అభిమానులతో కలిసి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ... బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత తొమ్మిదన్నరేళ్ల కాలంలో దేశంలో కులాలు,మతాలు, జాతులు, రాష్ట్రాల మధ్య వైషమ్యాలను సృష్టించి పబ్బం గడుపుతోందన్నారు. దేశానికి రాహుల్‌గాంధీ ప్రధాని కావాలని, బీజేపీ ప్రధాని నరేంద్రమోదీ కబంధహస్తాల నుంచి విముక్తి పొందాలన్నారు.మదనపల్లెలో ఏపీ పునర్విభజన చట్టం–2014లో అప్పటి ప్రధాని మన్మోహన్, యూపీఏ చైర్మన్ సోనియా రాయలసీమ, ఉత్తరాంధ్రలోని వెనుకబడిన జిల్లాలకు ప్రకటించిన ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీని అమలుచేయాలని సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అమృతతేజ, షేక్‌అల్లాబక్షు, గోశాలదేవి, మన్సూర్‌అలీ, మహమ్మద్‌షరీఫ్, డాక్టర్. వర్ధన్‌చౌదరి, ఎం.ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి, రామచంద్ర యాదవ్, లీలాశ్రీనివాస్, సోమశేఖర్‌రెడ్డి, పూలభాస్కర్, రెడ్డిసాహెబ్, సురేంద్ర, వేల్పులశ్రీధర్, మీనాకుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యం

జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్



రాయచోటి: ప్రజల ఆరోగ్య పరిరక్షణే ప్రభుత్వ లక్ష్యమని, జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల వద్ద ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అధికారులను ఆదేశించారు. గురువారం రాయచోటి కలెక్టరేట్ నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల నిర్వహణపై వైద్యాధికారులు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, మండల స్పెషల్ ఆఫీసర్లు, మున్సిపల్ కమిషనర్లతో జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందన్నారు. అధికారులు కూడా క్యాంపుల నిర్వహణ బాగా చేస్తున్నారన్నారు. ప్రజా ప్రతినిధులు కూడా పాల్గొంటున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఇంటివద్దకే ప్రభుత్వం వైద్య సేవలు అందిస్తోందని తెలిపారు. స్పెషలిస్టు డాక్టర్లు, మెడికల్ అధికారులు భాగస్వామ్యం అవుతున్నారన్నారు. ఇందుకు అందరినీ అభినందిస్తున్నట్లు తెలిపారు.జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను పటిష్టవంతంగా నిర్వహించి అన్నమయ్య జిల్లాను ప్రథమస్థానంలో నిలపాలని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ కొండయ్య, డీసీహెచ్ఎస్ డాక్టర్ సుకుమార్, మెడికల్ అధికారి డాక్టర్ రియాజ్, జీఎస్‌డబ్ల్యూఎస్ మనోహర రాజు, సర్వే ఏడీ జయరాజు, సోషియల్ వెల్ఫేర్ అధికారి జాకీర్ హుస్సేన్, ఇరిగేషన్ అధికారి కృష్ణమూర్తి, తహశీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమీషనర్లు, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితా విడుదల

కడప ఎడ్యుకేషన్: రాయలసీమ పరిధిలోని ఆదర్శ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల ప్రాథమిక సీనియారిటీ జాబితా గురువారం విడుదల చేసినట్లు పాఠశాల విద్య ఆర్‌జేడీ వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. టీజీటీలకు పీజీటీలుగా పదోన్నతులు కల్పించేందుకు ఈ జాబితాను జిల్లా విద్యాశాఖాధికారులకు పంపామని, 7వ తేదీలోగా అభ్యంతరాలను మెయిల్ ద్వారా లేదా పాఠశాల విద్య ప్రాంతీయ సంచాలకులకు rjdsekadapa@ap schooledu.in ద్వారా పంపాలని సూచించారు. అక్టోబరు 10వ తేదీలోపు అభ్యంతరాలు పరిష్కరించి 11న సీనియారిటి జాబితా రూపొందిస్తామన్నారు. 12న సర్వీసు రిజిస్టర్, డ్యాకుమెంట్ల పరిశీలన, 13న పోస్టింగ్ అర్డర్లు అందజేస్తామని ఆయన వివరించారు.

ఉపాధ్యాయులే.. దేశ భవిష్యత్తు నిర్మాతలు

- జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి
- ఘనంగా అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం
- 'ఆకేపాటి' ఫౌండేషన్ ట్రస్టు ఆధ్వర్యంలో 400 మందికి పురస్కారాలు




సన్మానం పొందిన ఉపాధ్యాయులతో అతిథులు

కడప సెవెన్‌రోడ్స్: దేశ భవిష్యత్తు నిర్మాతలు ఉపాధ్యాయులేనని జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి అన్నారు. అజ్ఞానాన్ని తొలగించి పిల్లల్లో క్రమశిక్షణ నేర్పి ఉత్తమ భావి భారత పౌరులుగా తీర్చిదిద్దే గురుతర బాధ్యత గురువులదేనన్నారు. అందుకే ఉపాధ్యాయ వృత్తికి సమాజంలో గౌరవప్రదమైన స్థానముందని పేర్కొన్నారు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జెడ్పీ సమావేశ మందిరంలో కడప, రాజంపేట పార్లమెంటు పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు రంగాలకు చెందిన 400 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఆకేపాటి ఫౌండేషన్ ట్రస్టు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి పురస్కారాలు అందజేశారు. జెడ్పీ చైర్మన్ ఆకేపాటి మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. 1982లో వైఎస్.రాజశేఖరరెడ్డి విద్యాశాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఉపాధ్యాయుల జీతభత్యాలు, ఇతర సమస్యలను పరిష్కరించారన్నారు. సీఎంగా ఫీజు రీఎంబర్స్‌మెంట్ పథకాన్ని తీసుకొచ్చి పేదలకు ఉన్నత విద్య చదివే అవకాశం కల్పించారన్నారు. నేటి సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చారన్నారు. చిత్తూరు జిల్లా జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ ఉపాధ్యాయులే దేశ ఆర్థిక నిర్మాతలు అన్నారు. సీఎం వైఎస్ జగన్ విద్యకు వేల కోట్లు ఖర్చు చేస్తున్నారన్నారు. మన విద్యార్థులు ఐక్యరాజ్య సమితిలో ప్రతిభ చాటుతున్నారని కొనియాడారు. కలెక్టర్ విజయరామరాజు మాట్లాడుతూ పిల్లలను క్రమశిక్షణలో పెట్టాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. క్రమశిక్షణతోనే భవిష్యత్తు సాధ్యపడుతుందన్నారు. అన్నమయ్య జిల్లా కలెక్టర్ పీఎస్ గిరీషా మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధ్యాయులనే ఆదర్శంగా తీసుకుంటారని చెప్పారు. తమ జిల్లాలో 12000 కంటి ఆపరేషన్లు, 1000 మంది టీబీ రోగులను ఆదుకునే విషయంలో ఆకేపాటి ఫౌండేషన్ ఇచ్చిన సాయం మరువలేనిదన్నారు. మేయర్ సురేష్‌బాబు మాట్లాడుతూ అవినీతికి తావు లేని రంగం ఏదైనా ఉందంటే అది ఉపాధ్యాయ రంగమేనని కొనియాడారు. ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగానికి రూ. 58 కోట్ల బడ్జెట్ కేటాయించిందన్నారు. పాఠశాలల్లో డిజిటల్ బోర్డులు, బాత్‌రూమ్‌లు, ఫ్యాన్లు, ఇతర సదుపాయాలు కల్పించిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. ఈ కార్యక్రమంలో తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి, జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి, కడప, అన్నమయ్య డీఈఓలు రాఘవరెడ్డి, పురుషోత్తంతోపాటు పెద్దసంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంతు చిక్కని కారణం

- భార్య, పిల్లలను కాల్చి హెడ్ కానిస్టేబుల్ ఘాతుకం
- వివాహేతర సంబంధమే కారణమా..
- జూన్ నెలలో కొని ఇప్పుడెందుకు డాక్యుమెంట్ రాసినట్లు..



హత్యకు ఉపయోగించిన పిస్టల్



వెంకటేశ్వర్ ఇంటి బెడ్ రూంలో మృతదేహాలు



లాస్య (ఫైల్)



అభిజ్ఞ (ఫైల్)



మృతదేహాన్ని తీసుకొస్తున్న సిబ్బంది


కడప అర్బన్: వైఎస్సార్ జిల్లాలో సంచలనం సృష్టించిన హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వర్ ఇంట్లో కాల్పుల ఘటనపై కారణాలు అంతుచిక్కడం లేదు. ఆర్థిక సమస్యలు, మరో మహిళతో వివాహేతర సంబంధం కలిగి ఉండటమే కారణమా? లేక ఇంకా ఏమైనా ఉన్నాయా? అనే విషయాలు పోలీసుల ప్రాథమిక విచారణలో తెలియాల్సి ఉంది. వివరాలు.. వైఎస్ఆర్ జిల్లా పులివెందుల టౌన్‌కు చెందిన టి. వెంకటేశ్వర్ 1993లో పోలీసుశాఖలో కానిస్టేబుల్‌గా చేరాడు. తర్వాత హెడ్‌కానిస్టేబుల్‌గా (హెచ్‌సీ. 1695)గా పదోన్నతి పొందాడు. ఈ క్రమంలోనే ట్రాన్స్‌కో విజిలెన్స్‌లో పనిచేశాడు. ఇతనికి భార్య మాధవి (47) కుమార్తెలు లాస్య (21), అభిజ్ఞ (16) ఉన్నారు. మొదటి కుమార్తె డిగ్రీ ఫైనలియర్ చదువుతోంది. రెండో కుమార్తె కో–ఆపరేటివ్ కాలనీలో విద్యామందిర్‌లో 10వ తరగతి చదువుకుంటోంది. వీరు విద్యామందిర్ స్కూల్‌కు సమీపంలోని ఓ ఇంటిలో నివాసం ఉంటున్నారు.

వివాహేతర సంబంధమే..
కాగా, కడప చిన్నచౌక్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సమయంలో యారాసు నాగేశ్వర్‌రెడ్డి మరణానంతరం అతని భార్య యారాసు రమాదేవితో పరిచయం ఏర్పడింది. ఆమె రాజారెడ్డి వీధిలో కుమారుడు నాగలోకేశ్వర్‌రెడ్డితో పాటు నివాసం ఉంటోంది. ఆమెతో వివాహేతర సంబంధం కలిగి ఉన్న హెడ్‌కానిస్టేబుల్ టి. వెంకటేశ్వర్ ప్రస్తుతం కడప టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో రైటర్‌గా విధులను నిర్వహిస్తున్నాడు. ఈ ఏడాది జూన్ 23న కొనుగోలు చేసి పిల్లలను చంపిన తర్వాత నగదు, ఆస్తులు రమాదేవికి చెందాలని అక్టోబర్ 4న రాసిన డాక్యుమెంట్ పోలీసులకు లభ్యమైంది.

ఎస్సైకు సంబంధించిన పిస్టల్‌తో..
బుధవారం రాత్రి రాత్రి 10:30 గంటల వరకు సీఐ సయ్యద్ హాసం, ఎస్ఐలతో కలిసి విధులు నిర్వహించి ఇంటికి వచ్చాడు. ముందుగా అనుకున్న ప్రకారం తన కస్టోడియన్‌లో వున్న ఓ ఎస్ఐకి సంబంధించిన పిస్టల్‌ను, బుల్లెట్‌లను తీసుకుని ఇంటికి వచ్చాడు.భార్య,పిల్లలు నిద్రిస్తుండగా పిస్టల్‌తో ముగ్గురిని కాల్చిచంపాడు. తర్వాత తాను కాల్చుకుని చనిపోయాడు. మరో వైపు ఈ సంఘటన జరిగిన తర్వాత కడప డీఎస్పీ కార్యాలయానికి వెళ్లిన రమాదేవి, తాను హెడ్ కానిస్టేబుల్ టి. వెంకటేశ్వర్‌కు రెండో భార్యను కాననీ, కేవలం తనతో పరిచయం ఏర్పడి, సహజీవనం చేసే వారని పోలీసులకు తెలియజేసినట్లు సమాచారం. ఈ సంఘటనపై వెంకటేశ్వర్ సోదరి సువర్ణలతతో మాట్లాడగా వివాహేతర సంబంధం గురించి మాకు తెలియదని చెప్పింది.

సంఘటన స్థలాన్ని పరిశీలించిన డిప్యూటీ సీఎం, కడప మేయర్ ...
భార్య, పిల్లలను చంపి, తాను ఆత్మహత్యకు పాల్పడిన హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్ ఇంటిని, మృతదేహాలను ఉపముఖ్యమంత్రి ఎస్‌బీఅంజద్‌బాషా, కడప నగర మేయర్ కె. సురేష్‌బాబు, పులిసునీల్ కుమార్, అఫ్జల్‌ఖాన్ పరిశీలించారు. ఈ సంఘటన చాలా బాధాకరమని తెలియజేశారు. ఈ సంఘటనలో పోలీసు అధికారులను, సిబ్బందిని కర్నూలు– కడప రేంజ్ డిఐజి సెంథిల్ కుమార్, జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్‌లు ప్రత్యేకంగా విచారించారు. ఈ సంఘటనపై కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కడప చిన్నచౌక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

బీఈడీ, ఎంఈడీ సెమిస్టర్ ఫలితాలు విడుదల



పరీక్షా ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ ఆచార్య చింతా సుధాకర్ తదితరులు

వైవీయూ: యోగి వేమన విశ్వవిద్యాలయం అనుబంధ బీఈడీ, ఎంఈడీ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య చింతాసుధాకర్, పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎస్.ఈశ్వరరెడ్డి గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ బీఈడీ ప్రథమ సెమిస్టర్ పరీక్షలకు 2203 మంది హాజరుకాగా, 1959 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. ఎంఈడీ ఒకటి, నాలుగు సెమిస్టర్ పరీక్షలకు 149 మంది హాజరుకాగా 137 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ పరీక్షల నియంత్రణ అధికారి డా. ఆదినారాయణరెడ్డి పాల్గొన్నారు.

8న మహాజన సభ

బి.కొత్తకోట: హార్సిలీహిల్స్ కో–ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ మహాజన సభ ఈనెల 8న ఆదివారం నిర్వహిస్తున్నట్లు సంఘ కార్యదర్శి రాజేంద్రప్రసాద్‌రెడ్డి తెలిపారు. గతనెల 30న జరగాల్సిన మహాజన సభకు సభ్యులు హాజరుకాకపోవడంతో వాయిదా వేసిన విషయం తెలిసిందే. దీంతో సభను మదనపల్లెలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు ఎంతమంది హాజరవుతారు, కోరం ఉంటుందా లేదా అన్నది చూడాలి.

క్లుప్తంగా

మద్యం మత్తులో వాహనం నడిపిన వ్యక్తికి జైలు

నందలూరు (రాజంపేట): మద్యం సేవించి వాహనం నడిపినందుకు నందలూరు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కె.లత నాలుగురోజులు జైలు శిక్ష, రూ. 1000లు జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెనగలూరు పోలీస్ స్టేషన్‌లో నమోదైన క్రైమ్ నంబర్. 130/2023లో నారాయణరావు గిరి అనే వ్యక్తికి ఈమేరకు శిక్ష విధించామన్నారు. మద్యం సేవించి వాహనం నడపడం నేరమన్నారు.

పాముకాటుతో మహిళా రైతు మృతి


ఈశ్వరమ్మ (ఫైల్)

పీలేరురూరల్ : పాము కాటుతో మహిళా రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని అగ్రహారంలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. అగ్రహారం పంచాయతీ ఎనుమలవారిపల్లెకు చెందిన చిన్నరాజు భార్య ఈశ్వరమ్మ (52) గురువారం సాయంత్రం గ్రామ సమీపంలోని తమ వ్యవసాయ పొలం వద్దకు వెళ్లింది. పశుగ్రాసం కోసే సమయంలో పాము కాటుకు గురైంది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందింది.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



రాయచోటిటౌన్ : రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రిలో గుర్తు తెలియని వ్యకి (65) మృతి చెందాడు. గతకొన్ని రోజులుగా ఆయన రాయచోటి రూరల్ పరిధిలోని చెన్నముక్కపల్లె సమీపంలో పొలాల వద్ద గుడారాలలో ఉంటూ పట్టణ పరిసర ప్రాంతాలలో తోపుడు బండిపై బెడ్ షీట్లు విక్రయించేవాడని తెలిసింది. చిత్తూరు జిల్లా అయిరాలకు చెందిన వ్యక్తి అయి ఉండవచ్చని భావిస్తున్నారు.

రైల్వేలో క్రెడిట్ సొసైటీ ఎన్నికల వేడి!

- ఊపందుకున్న ఎన్నికల ప్రచారం
- 12న పోలింగ్..4 స్టేషన్లలో ఏర్పాటు
- నాలుగు డెలిగేట్ స్థానాలకు పోటీ
- అభ్యర్థులను బరిలోకి దింపిన మజ్దూర్, సంఘ్



రాజంపేట : సౌత్‌సెంట్రల్ రైల్వే కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ డెలిగేట్ స్థానాలకు నోటిఫికేషన్ విడుదల కావడంతో రైల్వే కార్మిక వర్గాల్లో ఎన్నికల వేడి రాజుకుంది. ప్రధానంగా మజ్దూర్ యూనియన్, ఎంప్లాయిస్ సంఘ్ కార్మిక సంఘాలు తమ అభ్యర్థులను బరిలోకి దింపాయి. దీంతో మజ్దూర్, సంఘ్ కార్మిక నేతలు తమ పరిధిలోని సభ్యులను కలుసుకొని తమ డెలిగేట్‌ను గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు. విధుల్లో ఉన్న కార్మికుల వద్దకు వెళ్లి తమను గెలిపించాలని హామీలు గుప్పిస్తున్నారు. నందలూరు, కడప సెక్షన్లలో మజ్దూర్, సంఘ్ నేతలు పోటాపోటీగా ప్రచారం చేస్తున్నారు.

28 డెలిగేట్ స్థానాలకు...

గుంతకల్ రైల్వే డివిజన్ వ్యాప్తంగా డెలిగేట్ స్థానాలు 28కి చేరుకున్నాయి. ఇందులో మజ్దూర్ యూనియన్ 28 డెలిగేట్ స్థానాలకు పోటీ చేస్తుండగా, ఎంప్లాయిస్ సంఘ్ 27 డెలిగేట్ స్థానాలకు అభ్యర్థులతో ప్యానెల్‌ను విడుదల చేశాయి. కాగా ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో రెండు డెలిగేట్ స్థానాలు కేటాయించారు. కడప పరిధిలో 260, నందలూరు పరిధిలో 280 మంది సొసైటీ సభ్యులు ఓటర్లుగా నమోదయ్యారు. గెలిచిన డెలిగేట్స్‌లో సొసైటీ డైరెక్టర్లుగా ఎంపిక చేస్తారు. అది డివిజనల్ సెక్రటరీ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది.

12న పోలింగ్..

ఈనెల 12న ఉమ్మడి వైఎస్సార్ జిల్లా పరిధిలోని రెండు డెలిగేట్ స్థానాలకు పోలింగ్ జరగనుంది. ఇందుకోసం నందలూరు, కడప, ముద్దనూరు, జమ్మలమడుగు రైల్వేస్టేషన్ల ఎస్ఎంఆర్ కార్యాలయాల్లో పోలింగ్ కేంద్రాలుగా ఎంపిక చేశారు. భాకరాపేట నుంచి బాలపల్లె వరకు నందలూరు, కడప, ఎర్రగుంట్లకు కడప, ఎర్రగుంట్ల–నంద్యాల మార్గంలోని సెక్షన్‌లో వారికి జమ్మలమడుగు, కొండాపురం వరకు ఉన్న వారికి ముద్దనూరులో ఓటు వేసేలా రైల్వేశాఖ సన్నాహాలు చేస్తోంది. ఆరోజు విధి నిర్వహణలో ఉన్న వారు పోస్టల్ బ్యాలెట్ కోసం సికింద్రాబాద్‌లోని సొసైటీలో సంప్రందించి తీసుకోవాల్సి ఉంటుంది.


ఎండీ ఫజల్ అహమ్మద్(సంఘ్)


వై.గంగయ్య (సంఘ్)


గురువినోద్‌కుమార్(మజ్దూర్)


పి.కిరణ్‌బాబు(మజ్దూర్)

పోటీ చేస్తున్న అభ్యర్థులు వీరే..

సొసైటీ ఎన్నికల్లో అభ్యర్థులను మజ్దూర్, ఎంప్లాయిస్ సంఘ్‌లు ప్రకటించాయి. సౌత్‌సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ తరపున పి.గురువినోద్‌కుమార్(రాజంపేట), పి.కిరణ్‌బాబు(కడప), సౌత్‌సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ తరపున వై.గంగయ్య(జమ్మలమడుగు), ఎండీ ఫజల్ అహమ్మద్(రాజంపేట) పోటీ చేస్తున్నారు. వీరికి గుర్తులు కూడా కేటాయించారు.

మదీనాలో రైల్వేకోడూరు వాసి మృతి


రహమతుల్లా(ఫైల్)

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణానికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు షేక్ రహమతుల్లా (82) బుధవారం రాత్రి మదీనాలో మృతి చెందారు. స్థానికుల సమాచారం మేరకు సౌదీ అరేబియా దేశంలోని మక్కా మదీనాను సందర్శించడానికి గత నెల 27వ తేదిన ఆయన వెళ్లారు. అక్కడ మక్కాను దర్శించుకొని మదీనాలో ఆరోగ్యం సరిలేక మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు.

ఉద్యోగాల పేరుతో మోసం

కలకడ : ఉద్యోగాలు ఇప్పిస్తామని మాయమాటలు చెప్పి నగదు తీసుకుని మోసం చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ సిటిస్వామి కథనం మేరకు.. మండలంలోని ఎనుగొండపాళ్యం పంచాయతీ మొరంమీదపల్లెకు చెందిన నరసింహులు, మండలంలోని దిగువతాండాకు చెందిన శివకుమార్‌నాయక్‌ల వద్దనుంచి తిరుపతికి చెందిన రామాంజినేయులు ఎస్వీ యూనివర్సిటీలో రికార్డ్ అసిస్టెంట్ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించాడు. నరసింహులు వద్ద 3లక్షల 55వేల రూపాయలు, శివకుమార్‌నాయక్ వద్ద రూ.5లక్షలు తీసుకున్నాడు. ఆ తర్వాత ఎలాంటి ఉద్యోగం ఇప్పించకపోవడంతో గురువారం బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం

అన్నమయ్య జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు

రైల్వేకోడూరు : ఎర్రచందనం అక్రమ రవాణా, మట్కా, జూదం, గంజాయి, దొంగతనాలు, బెల్టుషాపులు లాంటి అసాంఘిక కార్యక్రమాలపై ఉక్కుపాదం మోపుతామని అన్నమయ్య జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు పేర్కొన్నారు. గురువారం రైల్వేకోడూరు పట్టణంలోని పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఎస్పీకి డీఎస్పీ చైతన్య, సీఐ మధుసూదన్ రెడ్డి, సిబ్బంది స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్టేషన్ ఆవరణాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. రిసెప్షన్‌ను సందర్శించి పలు రికార్డుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పటిష్ట చర్యలు చేపడతామన్నారు. కేసులు త్వరితగతిన పరిష్కరించి ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని సిబ్బందికి సూచించారు. ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలను పరిష్కరించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని, వాహనదారులకు, ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు నాయక్, వెంకటేశ్వర్లు, సుభాష్‌చంద్రబోస్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


ఓబులవారిపల్లె పోలీస్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ

పోలీసు స్టేషన్ తనిఖీ

ఓబులవారిపల్లె : స్థానిక పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రాజంపేట డీఎస్పీ వీకే చైతన్య, రైల్వేకోడూరు సీఐ మధుసూదన్ రెడ్డి, రైల్వేకోడూరు ఎస్ఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చిట్వేలి : చిట్వేలి పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు గురువారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సుభాష్ చంద్రబోస్, స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నర్సరీ యజమాని ఇంట్లో చోరీ

రూ.14 లక్షలు అపహరణ

మదనపల్లె : పట్టణంలోని దేవతానగర్ సమీపంలోని బాలాజీనగర్‌లో చోరీ జరిగింది. ఇక్కడ నివాసమున్న నర్సరీ యజమాని పిచ్చయ్య కుమారుడు గంగులయ్య అనంతపురం జిల్లా బళ్లారి సమీపంలో నర్సరీ నిర్వహిస్తున్నాడు. కుటుంబసమేతంగా అక్కడే ఉంటున్నాడు. ఇటీవల వినాయకచవితి సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి వచ్చాడు. తిరిగి సెప్టెంబర్ 27వతేదీ బళ్లారి వెళ్లాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం మదనపల్లెకు వచ్చి ఇంటికి వెళ్లగా ఇంటికి ఉన్న తాళం పగలగొట్టి ఉండటం, తలుపు తెరిచి ఉండటంతో ఇంట్లోకి వెళ్లి చూడగా వస్తువులన్నీ చిందరవందరగా పడి బీరువా పగలగొట్టి తెరిచి ఉండటాన్ని గమనించాడు. దీంతో చోరీ జరిగిన విషయం గుర్తించి తాలూకా పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. అనంతరం చోరీ ఘటనపై కేసు నమోదు చేశామని ఇంట్లో 40 గ్రాముల బంగారు, 50 వేల రూపాయల నగదు చోరీకి గురైనట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు. అయితే నర్సరీ వ్యాపారం నిర్వహిస్తున్న గంగులయ్య మాత్రం ఇటీవల వ్యాపారంలో నష్టం రావడంతో ఒక నర్సరీని విక్రయించి రూ.14 లక్షకు పైగా నగదు తెచ్చి బకాయిలు చెల్లించి నగలు బ్యాంకు నుంచి విడిపించేందుకు ఇంట్లో ఉంచామంటున్నాడు. బళ్లారిలోని నర్సరీలో కూలీల సమస్య ఏర్పడంతో కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లి తిరిగి రావడం ఆలస్యమైందని.. తీరా వచ్చి చూశాక చోరీ జరిగి రూ.14 లక్షలు అపహరణకు గురయ్యాయని తెలిపాడు. ఘటనపై సీఐ మాట్లాడుతూ ప్రాథమికంగా ఘటనపై కేసు నమోదు చేశామని విచారణలో పూర్తి వివరాలు తెలుస్తాయన్నారు.

15 లీటర్ల సారా స్వాధీనం

పీలేరు రూరల్ : మండలంలోని తలపుల పంచాయతీ వడ్డిపల్లె సమీపంలోని అటవీ ప్రాంతంలో దాడులు నిర్వహించి 15 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ వై. గురుప్రసాద్ తెలిపారు. తలపుల గ్రామానికి చెందిన జి. రెడ్డెమ్మ, మొరవడ్డిపల్లెకు చెందిన కె.హరినాథ్‌లను అరెస్టు చేశామన్నారు. సెబ్ ఎస్ఐ లక్ష్మీనరసయ్య, సిబ్బంది సుధాకర్, బాలకృష్ణ, గంగామహేశ్వరి పాల్గొన్నారు.

అన్నదమ్ముల అదృశ్యం

– కేసు నమోదు చేసిన పోలీసులు



మహమ్మద్ ఇక్బాల్, సిరాజుద్దీన్ (ఫైల్)

నందలూరు (రాజంపేట): మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ కుమ్మరపల్లి గ్రామానికి చెందిన షేక్ మహమ్మద్ ఇక్బాల్, షేక్ సిరాజుద్దీన్ అనే ఇద్దరు అన్నదమ్ములు తప్పిపోయినట్లు ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్ తెలిపారు. 2013వ సంవత్సరంలో షేక్ మహమ్మద్ ఇక్బాల్, 2018లో షేక్ సిరాజుద్దీన్‌లు ఇంటి నుంచి వెళ్లి ఇంత వరకు తిరిగి రాలేదని, వారి సోదరి షేక్ షకీలా బేగం ఫిర్యాదు చేశారన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, తప్పిపోయిన వ్యక్తుల గురించి సమాచారం తెలిస్తే నందలూరు పోలీస్ స్టేషన్‌లో తెలియజేయాలని ఎస్ఐ కోరారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

మదనపల్లె : ఐదుగురు జూదరులను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు తాలూకా సీఐ సత్యనారాయణ తెలిపారు. మండలంలోని అంకిశెట్టిపల్లె సమీపంలోని హంద్రీ–నీవా కాలువ వద్ద ఐదుగురు వ్యక్తులు జూదం ఆడుతుండగా అదుపులో తీసుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.5,100 నగదు స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేశామన్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో ఇద్దరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కురబలకోట మండలం ముదివేడు పంచాయతీ సాయిబులపల్లెకు చెందిన మహబూబ్‌బాషా భార్య రేష్మా (25) కుటుంబ సమస్యలతో గురువారం నిద్రమాత్రలు మింగింది. అదే విధంగా వాల్మీకిపురం మండలం జర్రావారిపల్లెకు చెందిన చలపతి కుమారుడు ఎస్.ఉదయకుమార్ (26) కుటుంబ సమస్యల కారణంగా పురుగుల మందు తాగాడు. ఆయా సంఘటనల్లో కుటుంబ సభ్యులు బాధితులను 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసులు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థిని అదృశ్యం

సంబేపల్లి : సంబేపల్లి మండల పరిధిలోని నారాయణరెడ్డిపల్లి గ్రామం కొండావాండ్లపల్లెకు చెందిన డిగ్రీ విద్యార్థిని అదృశ్యమైనట్లు ఎస్ఐ షరీఫ్ తెలిపారు. విద్యార్థిని తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు రాయచోటిలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఆమె డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతోంది. బుధవారం నుంచి కనిపించడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రేషన్ షాపు స్థాయిలో విజిలెన్స్ కమిటీలు

జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

మదనపల్లె : ఉచిత బియ్యం అక్రమ మార్గంలో తరలించకుండా అడ్డుకునేందుకు క్షేత్రస్థాయిలో రేషన్ దుకాణాల వారీగా గతంలో ఉన్న ఆహార సలహా కమిటీల స్థానంలో విజిలెన్స్ కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. గురువారం మదనపల్లె మండలం బసినికొండ, వలసపల్లె పంచాయతీల్లో కాపు కమ్యూనిటీ హాల్, మున్సిపల్ కార్యాలయం, లారీ ఓనర్స్ అసోసియేషన్‌లకు ప్రభుత్వ స్థలం కేటాయింపునకు సంబంధించి మార్కెట్ వ్యాల్యూ నిర్ణయించేందుకు ఆర్డీఓ ఎం.ఎస్. మురళీతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం సబ్‌కలెక్టరేట్‌లో మీడియాతో మాట్లాడుతూ మండల, డివిజన్, జిల్లా స్థాయిలో కమిటీలతో పాటు ప్రతి రేషన్ డిపోకు ఓ కమిటీని నియమిస్తామన్నారు. అన్నమయ్య జిల్లాలో ప్రస్తుతం 56 గ్రామాల్లో రీసర్వే జరుగుతోందని, రైతులు సహకరించక రీసర్వే పనులు కొంతమేర ఆలస్యమవుతోందన్నారు. జిల్లాలోని పెట్రోల్ పంపుల్లో కొలతలు, నాణ్యతకు సంబంధించి ఫిర్యాదులు అధికమైన నేపథ్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. గ్యాస్ ఏజెన్సీలు సిలిండర్ డెలివరీ సమయంలో వినియోగదారుల నుంచి బిల్లు కంటే అదనంగా వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ప్రజలు అదనపు డబ్బులు చెల్లించనవసరం లేదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకా చలపతి, బలిజ సేవాసమితి అధ్యక్షుడు బీపీఎల్ విజయకుమార్, మండల సర్వేయర్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.


బసినికొండలో కాపు కమ్యూనిటీ భవనానికి కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న జేసీ,ఆర్డీఓ

నెల్లూరు, అనంత జట్ల విజయం

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్–23 అంతర్ జిల్లాల మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్‌లో నెల్లూరు, అనంతపురం జట్లు విజయం సాధించాయి. కడప నగరంలోని కేఓఆర్ఎం మైదానంలో నిర్వహిస్తున్న మ్యాచ్‌లో 189 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో మూడోరోజు గురువారం బరిలోకి దిగిన నెల్లూరు జట్టు 88.4 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 280 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కడప జట్టు 52.2 ఓవర్లలో 211 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. నెల్లూరు జట్టు 237 పరుగుల తేడాతో విజయం సాధించింది. కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహించిన మరో మ్యాచ్‌లో 168 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన చిత్తూరు జట్టు 44.2 ఓవర్లలో 182 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన అనంతపురం జట్టు 65 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 287 పరుగులు చేసింది. చివరకు అనంతపురం జట్టు 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

సర్వం.. ఆక్రమణల పర్వం!

- కబ్జాకోరల్లో బస్టాండు స్థలాలు
- డ్రైనేజీ కాలువలను సైతం వదలని వైనం
- ఆక్రమణలతో నిత్యం ప్రమాదాలు


ఎన్‌హెచ్ 340 రోడ్డు పై ఉన్న బస్టాండు ముఖచిత్రం


బస్టాండులో దుకాణాలపైకి దూసుకెళ్లిన వాహనాలు

గుర్రంకొండ : మండల కేంద్రమైన గుర్రంకొండ మేజర్ పంచాయతీలో ఎన్‌హెచ్ 340కు సంబంధించి రోడ్డుకిరువైపులా ఉన్న స్థలాలు కబ్జాకు గురయ్యాయి. దీంతో రోడ్డు ఇరుకుగా మారడంతో వాహనాలు దుకాణాలపై దుసుకెళుతున్నాయి. ప్రతి నిత్యం బస్టాండులో రోడ్డుప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఎన్‌హెచ్ 340కి ఇరువైపులా ఉన్న పంచాయతీ, శ్మశాన స్థలాలను కబ్జాచేశారు. చివరకు డ్రైనేజీ కాలువలను కూడా ఆక్రమించుకొని వాటిపై అద్దెలు వసూలు చేస్తున్నారు. ప్రభుత్వ స్థలాల్లో దుకాణాలు నిర్వహించుకొనే విషయమై నిత్యం బస్టాండులో ఘర్షణలు జరుగుతున్నాయి.

ఎన్‌హెచ్ 340తో రూపురేఖలు మారిన బస్టాండు

స్థానిక బస్టాండు కడప–బెంగళూరు జాతీయరహదారి ఎన్‌హెచ్ 340పై విస్తరించి ఉంది. ఇటీవల రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేశారు. దీంతో బస్టాండులో నిర్వహించుకొనే పలు దుకాణలను తొలగించేశారు. దీంతో బస్టాండు రూపురేఖలే మారిపోయాయి. రోడ్డుకిరువైపులా మూడు అడుగుల మేర డ్రైనేజీలను కూడా నిర్మించారు.

ఎన్‌హెచ్ 340 స్థలాలు కబ్జా

వ్యాపార కేంద్రంగా అభివృద్ధి చెందిన బస్టాండులో ఎన్‌హెచ్ 340కు సంబంధించి స్థలాలు, పంచాయతీ, శ్మశాన స్థలాలు ఇష్టానుసారంగా కబ్జాకు గురయ్యాయి. కబ్జాకు గురైన స్థలాల్లో సుమారు 100 దుకాణాలను అనధికారికంగా నిర్వహించుకుంటున్నారు. వీటిపై ఆక్రమణదారులు రూ. 3వేలు నుంచి రూ. 6వేలు వరకు అద్దెలు వసూలు చేసుకుంటున్నారు.


దుకాణాలపై దూసుకెళుతున్న వాహనాలు

స్థానిక జెడ్పీహైస్కూల్ నుంచి బస్టాండు మీదుగా గుర్రంకొండ కోట వరకు రోడ్డు కిరువైపులా ఉన్న ఎన్‌హెచ్ 340 స్థలాల్లో అక్రమంగా దుకాణాలు నిర్వహించుకుంటున్నారు. బస్టాండుతో పాటు పలుచోట్ల ఇష్టానుసారంగా దుకాణాలు వెలిశాయి. కనీసం ద్విచక్రవాహనాలు నిలుపుకొనేందుకు కూడా వీలులేకుండా స్థలాలు ఆక్రమణలకు గురయ్యాయి. దీంతో వాహనాలు, లారీలు, ద్విచక్రవాహనాలు అదుపుతప్పి దుకాణాల్లోకి దూసుకెళుతున్నాయి. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురికి ప్రాణాపాయం తప్పింది.

డ్రైనేజీ కాలువపై అద్దెలు వసూళ్లు

ఆక్రమణలకు కాదేది అనర్హం అంటూ పలువురు ఆక్రమణదారులు బస్టాండులోని డ్రైనేజీ కాలువలను కూడా ఆక్రమించేశారు. ఎన్‌హెచ్ 340 రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా బస్టాండులో ఇటీవల విశాలమైన డ్రైనేజీలు నిర్మించారు. వీటిని కూడా అక్రమార్కులు వదల్లేదు. వీటిని ఆక్రమించుకొని చిల్లర దుకాణాలు, తోపుడుబండ్లు నిర్వహించుకొనేందుకు అద్దెలకు ఇచ్చారు. చివరకు కాలువలపై రేకుల షెడ్లకు కూడా రూ. 3వేల వరకు అద్దెలు వసూలు చేస్తున్నారు.


ఆక్రమణలతో ఇబ్బందులు



బస్టాండులో రోడ్డుకిరువైపులా ఉన్న ప్రభుత్వ స్థలాలను పలువురు ఆక్రమించుకున్నారు. కొంతమంది డ్రైనేజీలను కూడా ఆక్రమించుకున్నారు. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. వాహనాలు దుకాణాలపైకి దూసుకెళుతున్నాయి. బస్టాండు నిత్యం ప్రమాదాలకు నిలయంగా మారుతోంది.

– మహబూబ్‌బాషా, గుర్రంకొండ.


నోటీసులు జారీ చేశాం



ప్రభుత్వ, పంచాయతీ స్థలాలను ఆక్రమించుకొన్నవారికి నోటీసులు జారీ చేశాం. ఇప్పటికే ఆ స్థలాలన్నీ సర్వే కూడా చేశాం. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాము. వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటాం.

– విశ్వనాథ్, పంచాయతీ ఈఓ, గుర్రంకొండ.

డ్రైనేజీలపై దుకాణాలతో ప్రమాదం



బస్టాండులో ఎన్‌హెచ్ 340 రోడ్డు కిరువైపులా ఉన్న డ్రైనేజీలపై దుకాణాలు నిర్వహించకూడదు. ఇటీవల బస్టాండులో వాహనాలు దుకాణాలపైకి దూసుకెళ్లిన సంఘటనలు చోటు చేసుకొన్నాయి. డ్రైనేజీలపై కాకుండా అవతలివైపు దుకాణాలు నిర్వహించుకోవాలి. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.

– దిలీప్‌కుమార్, ఎస్ఐ, గుర్రంకొండ